క్లుప్తంగా

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

పహాడీషరీఫ్: 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా జల్‌పల్లి, రిలియన్స్ కాలనీల్లో గురువారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పహాడీషరీఫ్ ఏఈ ఎల్‌వి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట: మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు సందర్భంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె. రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ కొహెడ, విజయపురి, విశాలాంధ్ర, రాజీవ్ స్వగృహ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, శివంహిల్స్, సీతారామాపురం, లెక్చరర్స్‌కాలనీ, ఆలిండియా రేడియో, శివపార్వతి ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, బ్యాంక్‌కాలనీ, లింగోజిగూడ, శివపురికాలనీ, భగత్‌సింగ్‌నగర్, జేబీ కాలనీ, పోస్టాఫీసు ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు, పెద్దఅంబర్‌పేట ఫీడర్ పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందని రామకృష్ణ తెలిపారు.

ప్రజా రవాణాలో డ్రైవర్లది కీలక పాత్ర

ఆర్టీసీ డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి



శుభాకాంక్షలు తెలుపుకుంటున్న డ్రైవర్లు

మహేశ్వరం: ప్రజా రవాణాలో డ్రైవర్లది కీలక పాత్ర అని మహేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ డ్రైవర్లతో కలిసి డ్రైవర్స్ డే నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు బాధ్యతగా డ్రైవింగ్ చేయడం వల్ల ఆర్టీసీ క్షేమంగా నడుస్తుందన్నారు. డ్రైవర్ల వల్లనే నిత్యం లక్షలాది మంది ప్రయాణికులు క్షేమంగా వారి గమ్య స్థానాలకు చేరుకుంటున్నారన్నారు. అంతకు ముందు ఉత్తమ డ్రైవర్లను ఆయన అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఎంపీఓ గీత



మాట్లాడుతున్న ఎంపీఓ గీత

శంకర్‌పల్లి: ప్రజలు పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని శంకర్‌పల్లి ఎంపీఓ గీత పేర్కొన్నారు. బుధవారం మోకిల గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు, అండర్‌డ్రైనేజీల ఏర్పాటునకు తీర్మాణం చేశారు. గ్రామంలో 284 ఇళ్లకు జీరో ట్యాక్స్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామంలో ప్రతిఒక్కరూ ఇంట్లో మొక్కలు నాటుకోవాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయొద్దన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ నాగభూషణ్, ఉప సర్పంచ్ గౌండ్ర రాజు, మోహన్‌రెడ్డి, గోపాల్ చారి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపోటములు సహజం



ఐక్యత చాటుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొత్తూరు: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. బుధవారం కొత్తూరు మండలంలోని ఎస్‌బీపల్లి, సిద్ధాపూర్, పెంజర్ల, కొడిచర్ల, మక్తగూడ, మల్లాపూర్‌తో పాటు ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కార్యకర్తలతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలకు తనతో పాటు నాయకులు కూడా అండగా ఉంటారని తెలిపారు. ఏ కార్యకర్తకు ఇబ్బంది వచ్చిన వెంటనే తన వంతు సహకారం అందించడానికి ముందుంటానన్నారు. ఇటీవల ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నట్లు తెలిపారు. రాజకీయంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ ప్రజా సమస్యలను పరిష్కరించడానికి వారికి అండగా ప్రజాక్షేత్రంలో ఉండి పోరాటం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మె సత్యనారాయణ, రాజు, మధుసూదన్‌రావు, మెండెకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు అందక.. బతుకు సాగక

- అవస్థలు పడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



కందుకూరు ఎంఈఓ కార్యాలయం

కందుకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్నం వేళ వంట చేసే కార్మికులకు నెలలు తరబడి బిల్లులు అందక అవస్థలు పడుతున్నారు. వారికి రావాల్సిన వేతనం సకాలంలో అందడంలేదు. దీంతో అప్పుల పాలవుతున్నారు. ఇదీ మండల పరిధిలోని మధ్యాహ్న భోజన కార్మికుల దుస్థితి. దీనిపై అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందించినవారే కరువయ్యారు.

భారంగా కుటుంబపోషణ

మండల పరిధిలోని 35 గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 30, ప్రాథమికోన్నత పాఠశాలలు 12, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 12 ఉన్నాయి. అందులో దాదాపు 5,945 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆయా పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం మధ్యాహ్న భోజనం అందిస్తోంది. అందుకు నియమించిన కార్మికులు దాదాపు 85 మంది వరకు ఉన్నారు. వంట చేసినందుకు 1–5వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ 5.45 చొప్పున, 6–8వ తరగతి వరకు రూ.8.17 చొప్పున, 9–10వ తరగతి వరకు రూ.10.67 చొప్పున ప్రభుత్వం అందించాలి. కోడి గుడ్లకు అదనంగా ఇవ్వాలి. కాగా 1–5వ తరగతి గత ఏడాది ఆగస్టు వరకు, 6–8వ తరగతి జులై వరకు, 9–10వ తరగతి సెప్టెంబర్ వరకు మాత్రమే బిల్లులు అందాయి. సుమారు ప్రతి నెలా మండలం మొత్తం రూ.4 లక్షల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఆ లెక్కన దాదాపుగా రూ.16 లక్షలకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మరోపక్క మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన వేతనం సెప్టెంబర్ నుంచి పెండింగ్ ఉంది. దీంతో వారు అప్పులు చేసి విద్యార్థులకు వండి పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. వారితో పాటు ఎంఈఓ కార్యాలయం పరిధిలో పని చేసే సీఆర్పీలు, ఐఆర్పీలు, ఎంఐఎస్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లకు సకాలంలో వేతనాలు అందడంలేదు. నవంబర్ వేతనం జనవరి మధ్యలో రాగా, డిసెంబర్ నెలది ఇంకా అందలేదు. దీంతో వారికి కుటుంబాలు గడవడం ఇబ్బందికరంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి మధ్యాహ్న భోజన కార్మికులతో పాటు మిగతా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

బిల్లులు పంపాం

మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు కొన్ని ఐదు నెలలు, కొన్ని నాలుగు నెలలు, మరికొన్ని మూడు నెలల వరకు పెండింగ్ ఉన్నాయి. ఆ బిల్లులతో పాటు వారి వేతనాలు, సిబ్బంది వేతనాలు విడుదల కోసం ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతం ఎస్టీఓ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. చాలా మండలాల్లో కూడా ఇదే సమస్య ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది.

– మనోహర్, ఇన్‌చార్జి ఎంఈఓ, కందుకూరు

ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని వినతి



డీఆర్‌వోకు వినతి పత్రం అందజేస్తున్న సుమన్ గౌడ్

పహాడీషరీఫ్: మామిడిపల్లి గ్రామంలోని 99/1 సర్వే నంబర్‌లో కోట్ల విలువజేసే ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి పరిరక్షించాలని గ్రామానికి చెందిన టీటీడీ ఎల్‌ఏసీ మెంబర్ గుర్జని సుమన్ గౌడ్ కోరారు. బుధవారం రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి టిఎల్ సంగీతకు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 99/1 సర్వే నంబర్‌లోని స్థలంలో ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపట్టారన్నారు. ఈ విషయంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయింది. గత నెలలో సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించి కొన్నింటిని మాత్రమే కూల్చారన్నారు. మిగిలిన వాటిని కూడా వెంటనే కూల్చివేయాలని ఆయన కోరారు.

విరివిగా విత్తనాలు నాటండి



మాట్లాడుతున్న ఏంపీడీఓ శ్రీకాంత్

తలకొండపల్లి: హరితహారంలో భాగంగా అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల పెంపకం జోరుగా సాగుతున్నాయని ఏంపీడీఓ శ్రీకాంత్ తెలిపారు. విరివిగా విత్తనాలు నాటి మొక్కలు పెంచాలని పిలుపునిచ్చారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నర్సరీల అవశ్యకత–మొక్కలతో కలిగే ప్రయోజనాలు అనే అంశంపై ఏంపీడీఓ బుధవారం గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అస్టెంట్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలను ఈ నెల 27లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

మండల కోఆర్డినేటర్‌గా అఫ్జల్‌బేగ్



నియామక పత్రం అందుకుంటున్న అఫ్జల్‌బేగ్

కందుకూరు: కాంగ్రెస్ కందుకూరు కోఆర్డినేటర్‌గా నేదునూరుకు చెందిన యండీ అఫ్జల్‌బేగ్ నియమితులయ్యారు. బుధవారం మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేఎల్‌ఆర్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం అఫ్జల్‌బేగ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి అప్పగించినందుకు ఆయనకు దన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, బుక్క పాండురంగారెడ్డి, పాపగళ్ల రవీందర్, వరికుప్పల బాబు, వత్తుల నారాయణ, పాపగళ్ల రాజు, మహేశ్వరం నాయకులు అల్లే కుమార్, ఏపూరి, పోతర్ల తిరుపతయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కాంచనలత

చేవెళ్ల: ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు ఇంట్లో ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా పెంచాలన్నారు. ఆడ, మగ తేడాలేకుండా చూడాలన్నారు. సమాజంలో మహిళలకోసం ప్రత్యేక అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవాలంటే బాలికలు బాగా చదువుకోవాలని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా బాలికల సంరక్షణకోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయ కర్త అనురాధ, అధ్యాపకులు రూప్నారవీంద్రన్, షేక్ మహబూబ్, రవీందర్, రాగిణి, స్వర్ణలత, సతీష్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం..

బాలికల ఎదుగుదలకు అన్నిరకాలుగా ప్రోత్సహించాలని ఖానాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, అంగన్‌వాడీ టీచర్ పంబలి భారతిలు పేర్కొన్నారు. ఖానాపూర్ జిల్లాపరిషత్ హైస్కూల్‌లో బాలికలకు నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలబాలికలను చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ పంబలి భారతి సహకారంతో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నీరజ, సుప్రియ, స్వాతి, జగదాంబ, రాధ, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణగౌడ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'నవతరం' అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి



మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

కందుకూరు: నవతరం యూత్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం కందుకూరు చౌరస్తాలో యూత్ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అతనిని ఎన్నుకున్నట్లు సభ్యులు పేర్కొన్నారు. అనంతరం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ నవతరం యూత్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. తనను ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మాజీ అధ్యక్షుడు తాళ్లా కార్తీక్, వెంకటేష్‌గౌడ్, అజీజ్, దీక్షిత్‌రెడ్డి, రఘుబాబు, వెంకటేష్, శివకుమార్‌గౌడ్, సభ్యులు సతీష్, శ్రీనివాస్‌జీ, వినోద్‌చారి, సుధాకర్‌రెడ్డి, నవీన్‌కుమార్, ప్రశాంత్‌చారి, జంగాచారి, రవీందర్, శేఖర్, సాయికుమార్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

మండల ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా నాయక్



మాట్లాడుతున్న సునీతా నాయక్

మహేశ్వరం: ప్రతీ ఆడపిల్ల కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని మండల ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా నాయక్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కేసీ తండా సమీపంలోని మోడల్ స్కూల్‌లో జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఆడపిల్ల చదువుకోవాలన్నారు. వారిని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అంతకు ముందు విద్యార్థినులకు ఆత్మ స్థైర్యం నింపే అంశాలు, కథలు చెప్పారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి ధనుంజయ్, కేసీ తండా సర్పంచ్ మోతిలాల్ నాయక్, ఎస్ఐ వెంకట్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ శ్రీదేవి, విద్యావతి, మహిళా కానిస్టేబుల్ స్వాతి, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు వాసు, పరమేష్, రెహానా, మాధవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి

నందిగామ: సమాజంలో ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని మొదళ్లగూడలోని సింబయాసిస్ అంతర్జాతీయ యూనివర్సిటీలో బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాహనాల డ్రైవర్లు, విద్యార్థులు తమ వాహనాలు నడిపే సమయంలో విధిగా నిబంధనలు పాటించాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలు కోల్పోతారన్నారు. దీంతో కుటుంబ సభ్యులు రోడ్డున పడే ప్రమాదం ఉందని సూచించారు. మద్యం సేవించి వాహనాలను ఎట్టి పరిస్థితిల్లో నడపొద్దన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మస్తాన్ ఆలీ, శ్రీకాంత్ రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

కొత్తూరు: పట్టణంలోని పాత జాతీయ రహదారి, ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే రోడ్డుతో పాటు పెంజర్ల పరిధిలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి షకీల్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పాతజాతీయ రహదారి కూడలీలో రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన దుకాణాల ఎదుట వాహనాలను నిలుపుతుండడంతో రోడ్డు ఇరుకుగా మారుతుందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే రోడ్డు ఇరుకుగా ఉండడం, దానికి తోడు చిరు వ్యాపారులు రోడ్డుపై కూరగాయాలను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రతీరోజు ఉదయం అడ్డాకూలీలు వందల సంఖ్యలో రోడ్డుపై గుమిగూడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా తయారైందని ఆయన తెలిపారు.

గ్రామ అభివృద్ధే లక్ష్యం

సర్పంచ్ సంధ్య

మొయినాబాద్ రూరల్: అజీజ్‌నగర్ గ్రామ అభివృద్ధే లక్ష్యమని సర్పంచ్ సంధ్యశ్రీశైలం, ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, అజీజ్‌నగర్ ఉపసర్పంచ్ అల్లం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అజీజ్‌నగర్ గ్రామంలో గ్రామ పంచాయతీ నిధులు రూ. 60లక్షలతో ఆయా కాలనీల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయించారు. పూర్తయిన రోడ్లను సర్పంచ్ సంధ్యశ్రీశైలం, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికోసం తాము ఐదు సంవత్సరాలుగా కృషి చేస్తున్నామన్నారు. తాగునీరు, డ్రైనేజీ, మురుగు కాలువ, రోడ్లు, విద్యుత్ వంటి సమస్యలు తలెత్తకుండా పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు కొండల్‌రెడ్డి, గీతారాజ్‌గోపాల్‌చారి, తిరుమల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ఆదుకోండి

ప్రొఫెసర్ కోదండరామ్, పార్లమెంటు ఇన్‌చార్జి మహేశ్వర్‌రెడ్డి



ప్రొఫెసర్ కోదండరామ్‌కు ఆహ్వాన పత్రం అందజేసి సన్మానిస్తున్న నాయకులు

షాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను ఆదుకోవాలని ప్రొఫెసర్ కోదండరామ్, ఉద్యమకారుల ఫోరం పార్లమెంటు ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలో షాబాద్ మండల ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు కుమ్మరి చెన్నయ్యలతో కలిసి ఫిబ్రవరి 4వ తేదీన చేవెళ్లలో జరిగే తెలంగాణ ఉద్యమకారుల కృతజ్ఞత సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమ కారులను ఆదుకొని వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి ఈదులపల్లి రాములు, ఉద్యమకారుల ఫోరం షాబాద్, మొయినాబాద్, చేవెళ్ల మండలాల అధ్యక్షుడు కుమ్మరి చెన్నయ్య, మహిపాల్, మండల కార్యదర్శి సత్యానందం, కుమార్, రామకృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, శికుమార్, తదితరులు పాల్గొన్నారు.

మల్లు రవికి సత్కారం


తలకొండపల్లి: మాజీ ఎంపీ మల్లు రవిని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమించడంపై కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో మల్లు రవిని పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేత శ్రీనివాసురెడ్డి, రెడ్ క్రాస్ ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి, వార్డు సభ్యుడు శివలింగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని రవిని కోరామని తెలిపారు.

మాడ్గుల: మల్లు రవి నియామకంపై మాడ్గుల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

రాజేందర్‌గౌడ్ కుటుంబాన్ని ఆదుకుంటాం

తలకొండపల్లి: మల్గం రాజేందర్‌గౌడ్ కుటుంబాన్ని ఆదుకుంటామని కాంగ్రెస్ జిల్లా ఉపా ధ్యక్షుడు భగవాన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. చౌదర్‌పల్లికి చెందిన రాజేందర్‌గౌడ్ మంగళవారం హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. చౌదర్‌పల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ చంద్రయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నేతల పూజలు



వంశీచంద్‌రెడ్డి దంపతులకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: చల్లా వంశీచంద్‌రెడ్డి దంపతులు షాద్‌నగర్‌కు విచ్చేసిన సందర్భంగా జానంపేట శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం పట్టణ శివారులోని కుంట రాంరెడ్డి ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి హాజరయ్యారు. చల్లా వంశీచంద్‌రెడ్డి దంపతు లు షాద్‌నగర్‌కు విచ్చేసిన సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఆలయ అర్చకులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్ రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, తిరుపతిరెడ్డి, జితేందర్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, అప్పి, ఖదీర్, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎంపీపీ కమ్లీమోత్యానాయక్



పనులు ప్రారంభిస్తున్న కమ్లీమోత్యానాయక్

కడ్తాల్: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గోవిందాయిపల్లి గ్రామ పంచాయతీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను సర్పంచ్ రామునాయక్‌తో కలిసి ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలందరికి సంక్షేమ పథకాలు అందించడంతో పాటు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. ప్రజలందరి భాగస్వామ్యంతో మండలాన్ని ప్రగతి పథంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. సర్పంచ్ రామునాయక్, పంచాయతీ కార్యదర్శి మధు, స్థానిక నాయకులు మాన్యనాయక్ వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

- చైతన్య యూనివర్సిటీ కులపతి సీహెచ్ పురుషోత్తమ్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్: కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించొచ్చని చైతన్య యూనివర్సిటీ కులపతి సీహెచ్ పురుషోత్తమ్‌రెడ్డి, చీఫ్ అడ్మిన్‌స్ట్రేటివ్ అధికారి సాత్వికరెడ్డి పేర్కొన్నారు. బుధవారం హిమాయత్‌నగర్ సమీపంలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ కళాశాలలో జీవ రసాయన శాస్త్ర విభాగంలో 'స్టడీస్ ఆఫ్ పాలిగాలిస్ట్ ఎంజాయిన్ ఆజ్ పర్ లాస్ నైగర్ స్ట్రైస్ ఆర్ఏ 401' అనే అంశంపై ప్రొఫెసర్ ఎస్ సుమ పర్యవేక్షణలో కె.వెంకటనాగరాజేశ్వరి పరిశోధన పూర్తి చేసినందుకు డాక్టరేట్ పట్టా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ దామోదర్, రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్, ప్రొఫెసర్ కవిత, శ్రీనివాస్, రీసెర్చ్ డీన్ ఆచార్య ఆర్ కిష్టఫర్, జగదీష్‌కుమార్, అధ్యాపకులు, పబ్లిక్ రిలేషన్ అధికారి గాదే రాంబాబు తదితరులు పాల్గొన్నారు.